ఈనాడు వనపర్తి

గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు



మానవ మనుగడకు మొక్కలే ఆధారం

ఖిల్లాగణపురం : ఆదర్శ పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ శ్వేతా మహంతి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి.. చిత్రంలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి, అధికారులు

16లో..

పైరు ఎండి.. కంటతడి



పెద్దమందడి శివారులో ఎండిన మొక్కజొన్న పంట

- పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితి
- దిక్కుతోచని స్థితిలో మక్కరైతు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 97,788 హెక్టార్లు కాగా.. ఈ ఖరీఫ్‌లో 91,892 హెక్టార్లలో పంట వేసినట్లు అధికారుల అంచనా. మొదట్లో అడపాదడపా మంచి వానలే పడటంతో ఎక్కువ మంది మొక్కజొన్న వేశారు. పంటకు చిన్నగా మొలకలు వచ్చాయి. తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తారుమారు అయింది. రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో మొక్కజొన్న ఎదగడం ఆగిపోయింది. మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. కనీసం పూతదశకు కూడా చేరుకోలేదు. చాలా ప్రాంతాల్లో సాగునీరు లేకపోవడంతో రైతులు వర్షాలపైనే ఆధారపడ్డారు. వరుణుడు కరుణించకపోవడంతో ఇపుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే వందల హెక్టార్లలో మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయింది. రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసినా ఏమీ చేయలేని పరిస్థితి.



మహబూబ్‌నగర్ : మొక్కజొన్న రైతులు నిండా మునిగారు. అప్పులు చేసి పంట వేస్తే పూర్తిగా ఎండిపోయింది. ఈ ఖరీఫ్‌లో వర్షాలు ఆశించినమేర కురవలేదు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 70 శాతానికి పైగా మొక్కజొన్న పంట నేలపాలవుతోంది. రైతులు కన్నీళ్లు దిగమింగుతున్నారు. వడ్డీలకు డబ్బులు తెచ్చి పంట వేస్తే కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో దిగాలుగా రోజులను వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో అసలు ఏం జరుగుతోందో కూడా చూడటం లేదు. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 80 శాతానికి పైగా మొక్కజొన్న పంట పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ జిల్లాలో సాధారణ సాగువిస్తీర్ణం కంటే 18 శాతం ఎక్కువగా మొక్కజొన్న పంట వేశారు. 80 శాతానికి పైగా ఎండిపోయింది. వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూలు జిల్లాల్లోనూ మొక్కజొన్న ఎండిపోయి కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో 4-5 అడుగుల వరకు ఏపుగా పెరగాల్సిన మొక్కజొన్న మొక్కలు కనీసం ఒకటిన్నర అడుగులు కూడా పెరగకుండా ఎండిపోయాయి. కంకులు పూతదశకు కూడా రాలేదు. వచ్చే వారం రోజుల్లో వర్షాలు కురిసినా పంట చేతికి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీమా లేదు.. రుణం లేదు.. : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొక్కజొన్న వేసిన పలువురు రైతులు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సహకారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బీమా సౌకర్యం గురించి కూడా వారికి సమాచారం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి రైతులను ప్రశ్నించగా.. ఆ విషయమే తెలియదని సమాధానం వచ్చింది. రుణాలు తీసుకున్న రైతులు కూడా తమకు బ్యాంకు అధికారులు ఏమీ చెప్పలేదని అంటున్నారు. పంటల గురించి వివరించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటికే మొక్కజొన్న రైతుల పరిస్థితి అధ్వానంగా మారినందున.. ఇతర పంటలు వేసిన రైతులపైనైనా

..మిగతా 3లో

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగుతీరు

జిల్లా	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు విస్తీర్ణం
మహబూబ్‌నగర్	37,484	44,278
నాగర్‌కర్నూలు	31,080	25,684
వనపర్తి	20,822	16,362
జోగులాంబ గద్వాల	8,402	5,568

పనులు చేసినా పస్తులే!

- అందని ఉపాధి కూలీ డబ్బు
- రూ.12.32 కోట్ల బకాయిలు



పామిరెడ్డిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

న్యూస్‌టుడే, పెద్దమందడి

ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే కనీసం 100 రోజులపాటు పనులు చూపించి ఆదుకునేందుకే ప్రభుత్వాలు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టాయి. పనిచేసే కూలీలకు క్రమం తప్పకుండా రోజువారీ కూలీ డబ్బులు చెల్లిస్తూ వారిలో భరోసా కల్పించాల్సిన ఈ పథకం రాన్రాను నమ్మకం కోల్పోతోంది. సమయానికి కూలీ డబ్బు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఉన్న ఊళ్లోనే పని దొరకడంతో పాటు క్రమం తప్పకుండా కూలీ డబ్బు అందుతుందని భావించి పేర్లను నమోదు చేసుకుని ఉపాధిపత్రాలూ పొందారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా నాలుగు నెలలుగా కూలీ అందడం లేదు.

52వేల కుటుంబాలకు తిప్పలు.. : వనపర్తి జిల్లాలో 52,927 కుటుంబాలు ఉపాధి హామీ పథకం కింద ఉపాధిపత్రాలు(జాబ్‌కార్డులు) కలిగి ఉన్నాయి. అందులో 2,927 మందికి కూలీ అందినా మిగతా 50 వేల మందికి నాలుగు నెలలుగా రాలేదు. వాటికి సంబంధించి రూ. 12.32 కోట్లు అందాల్సి ఉంది. అసలు సమస్య ఎక్కడుందో అధికారులు చెప్పలేకపోతున్నారు. వస్తాయంటూ దాటవేస్తున్నారని కూలీలు వాపోతున్నారు.

పూటగడవక అప్పులు.. : ఉపాధిహామీ పథకం కింద పనిచేసినందుకు క్రమం తప్పకుండా కూలీ డబ్బులొస్తాయని నమ్మకంతో నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నారు. మొదట్లో బాగానే పనికి తగ్గ కూలీ డబ్బులు వస్తుండడంతో ఉపాధి కోసం పూర్తిగా వలసలు వెళ్లడం మానుకున్నారు. వలసలు వెళ్లిన

..మిగతా 3లో

మండలాల వారీగా మూణ్నెల్లకు బకాయిలు..

మండలం	కూలీల సంఖ్య	బకాయిలు(రూ.లక్షల్లో)
ఆత్మకూరు	5,878	65.33
ఖిల్లాగణపురం	6,990	114.64
గోపాల్‌పేట	6,934	119.15
కొత్తకోట	11,070	147.84
పాన్‌గల్	14,152	132.94
పెబ్బేరు	16,179	218.13
పెద్దమందడి	5,670	104.42
వీపనగండ్ల	10,355	185.31
వనపర్తి	8,449	145.27



పురపాలికలో చెత్త రిక్షాలు ఇలా..

నిర్లక్ష్య తుప్పు

- శిథిలమవుతున్న పుర వాహనాలు
- ఏళ్ల తరబడి నిరుపయోగం

వనపర్తి పట్టణ కథనం 3లో..



ఉద్యాన స్ఫూర్తి.. పర్యటక కీర్తి

8,9లో..

25న బహుజన పుస్తకావిష్కరణ సభ

తాడూరు : హైదరాబాద్‌లో ఈ నెల 25న బహుజన పుస్తకావిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు బహుజన సంఘాల జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ కె.శివప్రసాద్ తెలిపారు. తాడూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా డా.కదిర కృష్ణ ఈ పుస్తకాన్ని రచించారన్నారు.

ఏకీకృత సర్వీసురూల్స్ వెంటనే చేపట్టాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు తుమ్మల సురేందర్‌రెడ్డి



పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేయిస్తున్న సురేందర్‌రెడ్డి

వంగూరు, న్యూస్‌టుడే : ఏకీకృత సర్వీసు రూల్స్, పదోన్నతులు, బదిలీలు వెంటనే ప్రభుత్వం చేపట్టాలని పీఆర్‌టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు తుమ్మల సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వంగూరు, ఉల్పర, కొండారెడ్డిపల్లి, రంగాపూర్ తదితర గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలో పీఆర్‌టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయు నిరంతరంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం జరుగుతుందన్నారు. పింఛన్ ఉద్యోగుల హక్కు అని , అందుకోసమే సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలని లేకుంటే ఉద్యమాలు తీవ్రంగా ఉంటాయన్నారు. సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు కార్యక్రమానికి పీఆర్‌టీయు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అనుగుణంగా తక్షణమే పదోన్నతులు, బదిలీల కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు నాణ్యతంగా విద్యనందించాలని, తల్లిదండ్రులు కూడా చిన్నారి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు, జిల్లా కార్యదర్శులు కమలాకర్‌రావు, గోవర్ధన్, మండల అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, కాటమయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కృష్ణాజలాల్లో నీటివాటాను తేల్చాలి

కొల్లాపూరు, న్యూస్‌టుడే : కృష్ణా జలాల్లో ప్రాంతాల వారిగా నీటి వాటాలను తేల్చాలని పాలమూరు అధ్యయన కమిటీ కన్వీనర్ రాఘవచారి, అఖిల పక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులలో జాప్యం తగదన్నారు. బుధవారం కొల్లాపూర్‌లోని కేఎల్‌ఐ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. రాఘవచారి ప్రాజెక్టుల వారీగా, ముంపు నిర్వాసితుల సమస్యలు, పరిహారం తదితర వాటిపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకంలో రెండు దశలుగా చేపట్టాలన్నారు. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి సాగు నీళ్లు పారించుకోవాలని తెరాస ప్రభుత్వం తిరోగమన దిశగా పనిచేస్తుందని విమర్శించారు. దిగువ ప్రాంతం నుంచి ఎగువ ప్రాంతంకు నీరు ఎలా తీసుకెళ్తారని, ఇప్పటికైనా పాలమూరు ఎత్తిపోతల పథకంను జూరాల నుంచి, రేగిమాన్‌గడ్డ నుంచి చేపట్టాలన్నారు. డిండికి కృష్ణా జలాలు తరలించడం వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 28న కొల్లాపూర్‌లో ధర్నా చేపట్టనున్నామన్నారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, బండివెంకట్‌రెడ్డి, బండిశ్రీను, తెదేపా నాయకులు చంద్రశేఖర్‌శెట్టి, పస్పుల నర్సింహా, శివానందం, సీపీఎం నాయకులు ఈశ్వర్, అశోక్ పాల్గొన్నారు.

రాజకీయ తిరుగుబాటుతోనే న్యాయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

నాగర్‌కర్నూలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పోలీసుల రాజ్యం కొనసాగుతోందని, రాజకీయ తిరుగుబాటుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ప్రభుత్వ పాలన, హక్కుల సాధనపై ప్రశ్నిస్తే దళితులపై కేసులను నమోదుచేస్తూ రౌడీషీటర్లుగా ముద్రవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజినేపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మంగి విజయ్‌పై అక్రమంగా నమోదుచేసిన రౌడీషీట్ కేసును ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఇదే మాదిరిగా అకారణంగా కేసులను నమోదు చేస్తే అక్కడి పోలీస్ అధికారిని వెనక్కి పంపించాల్సి వచ్చిందని, ఇక్కడి అధికారినీ అదే రకంగా పంపించాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో బస్సులను తగలబెట్టడం కరెక్టే అయితే నేరేళ్లపల్లి సంఘటనలో లారీలను తగలబెట్టడం కరక్టేనన్నారు. నాగర్‌కర్నూల్‌లో జిల్లాలో రౌడీషీట్లు తెరువడానికి దళితులే కనిపిస్తున్నారా? భూంధందాలకు పాల్పడుతూ అక్రమాలకు ఒడిగడుతున్న అగ్రకులాల వారు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. దళితులను అణగదొక్కే ప్రయత్నంలో భాగంగా కేసులను నమోదు చేస్తూ రౌడీషీట్లను తెరుస్తున్నారన్నారు. పోలీసులు దొరలకొమ్ము కాస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలు అధికంగా జరిగాయన్నారు. మూడేళ్లలో 120 మంది దళితులు హత్యకు గురవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. నా కారును 45 రోజుల క్రితం కొందరు వెంబడించారని కేసు పెడితే ఇంతవరకు పోలీసులు ఏమీ తేల్చలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పెద్దదిక్కుగా ఉన్న వెంకయనాయుడు ప్రత్యక్ష రాజకీయాల్లోంచి ఉపరాష్ట్రపతిగా వెళ్లడంతో కొంత అవరోధం ఏర్పడుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సవరణ చేయాలంటూ రెండు రాష్ట్రాలు కేంద్రానికి తీర్మానాలు పంపించాయని, వర్గీకరణ చేయడం మినహా కేంద్రానికి వేరే మార్గం లేదన్నారు. రాజ్యంగ సవరణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల కంటే దళితులే ముందు వరుసలో ఉన్నారని, ప్రత్యేక రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన దళితులను ప్రభుత్వ పెద్దలు వెనక్కినెడుతున్నారన్నారు. ఇప్పుడున్న మంత్రి వర్గంలోని సగంమంది మంత్రులు తెలంగాణను వద్దన్నవారేనన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు వంకేశ్వరం నిరంజన్, మంగి విజయ్, జెట్టి ధర్మరాజు, రాంచందర్, తిరుపతయ్య, విజయ్, మస్తాన్, కాశన్న, ప్రభాకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



విశ్లేషణాత్మక తులనంపై రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూలు, న్యూస్‌టుడే : రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడడాన్ని పెంచాలని బిజినేపల్లి మండలంలోని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త స్పందన అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి గ్రామంలో బుధవారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పంటల సాగులో మెలకువలపై రైతులకు పలు సలహాలు, సూచనలను అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్త స్పందన మాట్లాడుతూ పంటల సాగులో వస్తున్న మార్పులను రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ యాజమాన్య పద్ధతులను అవలంబించాలన్నారు. నేలలకు అనుకూలంగా ఉన్న పంటలనే సాగు చేస్తే దిగుబడులు పెరిగి రైతులు లాభాలను సాధిస్తారని వివరించారు. రసాయన ఎరువులను వినియోగిస్తే పెట్టుబడి పెరగడంతో పాటు పంట నష్టంపై ప్రభావం చూపుతుందన్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. అనంతరం పంటల విశ్లేషణాత్మక తులనాన్ని విద్యార్థులు పటం వేసి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాలెం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచి రాధ, ఎంపీటీసీ సభ్యుడు రాములు, రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య తుప్పు



నిరుపయోగంగా చెత్త కత్తిరింపు యంత్రం



శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకరు

న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

వనపర్తి జిల్లా కేంద్రంగా ఉన్న పురపాలక సంఘంలో అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధ రకాలకు వాహనాలు తుప్పు పడుతున్నాయి. ఏళ్ల తరబడి వీటిని పట్టించుకోకపోవడంతో వీటి విడి భాగాలను కొందరు ఎత్తుకెళుతున్నారు. ఇప్పటికే వివిధ వాహనాల విడి భాగాలు మాయమయ్యాయి. మరికొన్ని వాహనాలకు మరమ్మతులు చేయకపోవడంతో అవి తుప్పుపట్టి పాడవుతున్నాయి.

ఇదీ నిర్లక్ష్యం..

పురపాలక సంఘం అవసరాల కోసం కొనుగోలు చేసిన మరికొన్ని యంత్రాలను పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వీటికి తుప్పుపట్టి పాడయ్యే పరిస్థితి దాపురించింది. చిన్నపాటి మరమ్మతులతో వర్షాకాలంలో దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రం ఇక్కడ నిరుపయోగంగానే ఉంటోంది. పురపాలక సంఘంలో చెత్త సేకరణకు గతంలో ఏర్పాటు చేసిన పలు ట్రాక్టర్లు, చెత్త రిక్షాలు, నీటిట్యాంకరు శిథిలమవుతుండగా గతంలో ఇక్కడ చెత్త కత్తిరింపు యంత్రం కొనుగోలు చేసినా వినియోగించకపోవడంతో అదీ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోంది.

నిరుపయోగంగా రూ.30 లక్షల విలువైన యంత్రాలు.. : పురపాలక సంఘంలో కొత్తగా చేయతలపెట్టిన డింపింగుయార్డు నేపథ్యంలో పట్టణంలో ఇంటింటా సేకరించే చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి విక్రయించి పురపాలక సంఘానికి అదనపు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో ఏడేళ్ల కిందట చెత్త కత్తిరింపు యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రాన్ని అప్పట్లో సుమారు రూ. 7లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు లక్ష్యం నెరవేరకపోవడంతో చెత్తకత్తిరింపు యంత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఒనుగోలు చేసిన నాటినుంచి ఇప్పటివరకు ఇది నిరుపయోగంగానే ఉంటోంది.

● ప్రజల అవసరాల దృష్ట్యా నీటిని సరఫరా చేసేందుకు గతంలో పురపాలికకు సొంతంగా నీటి ట్యాంకరును కొనుగోలు చేశారు. కొంతకాలంపాటు ఇది బాగానే నడిచినా మరమ్మతులకు నోచుకోక ఇదీ నిరుపయోగంగానే ఉంటోంది. ఈ వాహనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటోంది.

● సూర్యపేట పురపాలక సంఘంలో అమలైన ఆదర్శవంతమైన, మెరుగైన పారిశుద్ధ్యం ఇక్కడా అమలు చేయాలన్న లక్ష్యంతో ఇంటింటా చెత్త సేకరణ చేసేందుకు 20 చెత్త రిక్షాలను కొనుగోలు చేశారు. ఇవీ కొంతకాలంగా నిర్వహణ బాగానే ఉండడంతో పనిచేశాయి. అనంతరం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వీటి వినియోగాన్ని వదిలేశారు. దీంతో ఇవీ శిహలావస్థకు చేరుకొని పాడైపోతున్నాయి.

● పురపాలక సంఘంలో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన పలు ట్రాక్టర్లు నిర్వహణ లేకపోవడంతో శిథిలమవుతున్నాయి. పురపాలక సంఘానికి చెందిన గతంలో చిన్నపాటి మరమ్మతులతో మూడు ట్రాక్టర్లు శిథిలమవుతున్నాయి. వీటినీ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలమవుతుండడంతోపాటు కొందరు ఆయా ట్రాక్టర్లకు సంబంధించిన పలు విడి భాగాలను ఎత్తుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

● పురపాలక సంఘంలో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణలో భాగంగా ఇందుకు ప్రధాన కారణమైన దోమల నివారణకు ఉపయోగపడే ఫాగింగ్ యంత్రమూ నిరుపయోగంగా మారింది. చిన్నపాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇది తుప్పుపట్టి పాడయ్యే ప్రమాదముంది. అధికారులు ఆయా వాహనాలు యంత్రాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తగిన చర్యలు తీసుకుంటాం.. : గతంలో పురపాలక సంఘంలో ఉపయోగపడిన ట్రాక్టర్లకు కాలం చెల్లిందని, చెత్త రిక్షాల విధానాన్ని తీసేయడంతో అవి నిరుపయోగంగా మారాయన్నారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు కాకపోవడంతో చెత్త కత్తిరింపు యంత్రం నిరుపయోగంగా ఉందన్నారు. ఫాగింగ్ యంత్రం బాగానే ఉందని, కొద్దిపాటి మరమ్మతులు చేసి త్వరలో దీన్ని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. నీటి ట్యాంకరూ పాడైందన్నారు.

– రంగన్న, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి

పైరు ఎండి.. కంటతడి

(మొదటిపేజీ తరవాయి) ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. వ్యవసాయశాఖ అధికారులు కూడా వర్షాల కోసం ఎదురుచూడకుండా రైతులకు ప్రత్యామ్నాయాల గురించి క్షేత్రస్థాయిలో వివరించాలి. రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే రైతన్న మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది.



ఆరెకరాల్లో పంట ఎండింది.. : సీజన్ ప్రారంభంలో వర్షాలు బాగా కురవడంతో ముందుగానే ఆరెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంట విత్తిన నాటి నుంచి వరుసగా వర్షాలు పడడంతో పంట ఏపుగా పెరిగింది. కంకి పట్టే దశకు చేరుకొన్నాక వర్షం లేకపోవడంతో పంట ఎండుమొహం పట్టింది. దంటులోని సారం పోయింది. ఇప్పుడు వర్షాలొచ్చినా పంట చేతికి రాదు. దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి అయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– నర్సింహ, పెద్దమందడి

మొక్కజొన్నలో కొంత దిగుబడి తగ్గుతుంది : ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వేసిన మొక్కజొన్న పంటకు నీరందక ఎండుమొహం పట్టింది. దీంతో మొక్కజొన్న దిగుబడిపై ప్రభావం చూపనుంది. దిగుబడి కొంత తగ్గుతుంది. ఇటీవల కురిసిన వర్షాలు పంటకు కొంత ఆదరవు కానున్నాయి.

– నూతన్‌కుమార్, ఏడీఏ(సాంకేతిక), వనపర్తి

వనపర్తి ఆర్టీసీకి అవార్డు



ఛైర్మన్, ఎండీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వనపర్తి మెకానిక్ బృందం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ఆర్టీసీ రాష్ట్ర యాజమాన్యం ప్రకటించే ఇంజిన్ హై మైలేజ్ అవార్డు వనపర్తి ఆర్టీసీకి దక్కింది. ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సులు ఫ్రంట్ యాక్సిల్, రియర్ యాక్సిల్, ఇంజిన్ గేర్ బాక్సులు ఎలాంటి మరమ్మతులు లేకుండా 10 లక్షల కి.మీ నడిచిన ఆర్టీసీ బస్సులకు అశోక్ లేల్యాండ్ కంపెనీ ఇంజన్ హైమైలేజ్ అవార్డుకు ఎంపిక చేస్తుంది. ఆర్టీసీలో 2015-16కుగాను 15 బస్సులు ఈ లక్ష్యాన్ని అధిగమించడంతో ఇంజన్ హై మైలేజ్ అవార్డుకు వనపర్తి డిపోను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర రాజధానిలోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో వనపర్తి డిపో మెకానిక్ బృందం అవార్డును అందుకుంది. తెలంగాణ ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ జి. రమణారావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డును అందుకున్న వారిలో డిపోనకు చెందిన ఎంఎఫ్ యాదయ్య, మెకానిక్‌లు ఏబీ మహమూద్, రమేశ్, రహీం, చిట్టిబాబు, పీవీఎస్ గౌడు, వెంకటేశ్, తిరుపతయ్య ఉన్నారు. వనపర్తి ఆర్టీసీకి ఇంజన్ హై మైలేస్ అవార్డు రావడంపై ఆర్టీసీ డీఎం రామయ్య, సహాయ డీఎం దేవేందర్‌గౌడు, ఆర్టీసీకి చెందిన వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎంఎఫ్, మెకానిక్ బృందాన్ని అబినంధించారు.

1 నుంచి వారబందీని అమలు చేయాలని డిమాండ్

అమరచింత : పీజేపీ ఆయకట్టు దారులకు సెప్టెంబరు 1 నుంచి వారబందీని అమలు చేయాలని పీజేపీ ఆయకట్టు దారుల ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చుక్క లింగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన నందిమళ్ల డ్యాం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వరినాట్లు పూర్తికాక ముందే జూరాల ప్రాజెక్టు అధికారులు వారబందీ నిర్ణయం తీసుకోవటంతో ఆయకట్టు రైతులు ఆందోళన పడుతున్నట్లు చెప్పారు. వారం రోజుల తర్వాత వారంబందీ అమలు చేస్తే నాట్లు పూర్తి దశకు చేరుకుంటాయన్నారు. యాసంగిలో ఆయకట్టు రైతులు వారబందీ పద్ధతితోనే పంటలు సాగు చేసుకున్నట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులను అర్థం చేసుకుని ఉన్న నీటిని పొదుపుగా వాడుకుందామన్నారు. ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న ఎత్తిపోతలకు నీటిని తరలించుకునే అవకాశం ఇవ్వవద్దన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు హరిశ్చంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్టుదల.. ఆత్మవిశ్వాసమే విజయానికి మూలం

పాలిటెక్నిక్ అధ్యాపకుల ఐకాస రాష్ట్ర కన్వీనర్ మురళీధర్‌గుప్తా

వీపనగండ్ల : విద్యార్థులు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసమే విజయానికి నాందవుతోందని పాలిటెక్నిక్ అధ్యాపకుల ఐకాస రాష్ట్ర కన్వీనర్ మురళీధర్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెల్‌కమ్ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకొంటే విషయ పరిజ్ఞానం పెరిగికొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన, పరిశోధన పెరుగుతోందన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకోసం రూ.10వేల వెచ్చించి గుర్తింపు కార్డులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ నర్సింహులు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో జంగిరెడ్డి, వివిధ పాఠశాలల జీహెచ్‌ఎంలు శైలజ, రమాకాంత్, శంకరయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పనులు చేసినా పస్తులే!



హరితహారంలో మొక్కల రక్షణ ఏర్పాట్లలో కూలీలు

(మొదటిపేజీ తరవాయి) బంధువులను సైతం కొందరు తిరిగి సొంతూరికి రప్పించుకున్నారు. ఇప్పుడేమో కూలీ డబ్బులు అందక ఇంట్లో తిండిగింజలు కొనడానికి డబ్బుల్లేక అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. కూలీ డబ్బులు వెంటనే ఇస్తే చేసిన అప్పులు తీర్చుకుంటామని కూలీలు అంటున్నారు. వలసలు వెళ్లకుండా ఉన్నచోటనే ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.



వస్తాయంటున్నారు.. ఇవ్వడం లేదు.. : నెల రోజుల కూలీ డబ్బు రావాల్సి ఉంది. అధికారులను అడిగినప్పుడల్లా వస్తాయనే చెబుతున్నారు. ఇంతవరకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కూలీ డబ్బులు అందకుంటే ఇంట్లో నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. నా భర్తకూ కూలీ డబ్బులు అందించాలి. ఆయనా స్థానికంగానే ఉపాధి పనులు చేస్తున్నాడు.

– అలివేలమ్మ, పెద్దమందడి



మూణ్నాలుగు రోజుల్లో చెల్లింపులు.. : ఉపాధిహామీ పథకం కింద పనిచేసిన కూలీలకు డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. ఇది జిల్లా స్థాయిలో జరిగింది కాదు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉంది. ప్రభుత్వం కూలీ డబ్బులకు సంబంధించి తన వాటాను మంజూరు చేసింది. మొదటి విడతగా మరో మూడు, నాలుగు రోజుల్లో కూలీలకు డబ్బులు చెల్లిస్తాం.

– గణేశ్‌జాదవ్, డీఆర్‌డీవో



ఇబ్బందులు పడుతున్నాం.. : ఉపాధిహామీ పథకం కింద మంచి కూలీ వస్తుందని భావించి సొంత ఇంటిపనిని సైతం మానుకుని పనిచేశాం. ఇప్పుడు నాలుగు నెలల కూలీ డబ్బులు అందక, ఇటు ఇంటిపనీ కాకుండా నష్టపోయాం. అధికారులు కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే కూలీ డబ్బులు ఇప్పించేలా చూడాలి.

– చిట్టెమ్మ, అల్వాల

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	82–00	84–00
రిటైల్	97–00	99–00
డ్రెస్డ్	136–00	144–00
స్కిన్‌లెస్	160–00	168–00

వనపర్తి

తెరపై ఈనాడు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే

శ్రీరామా : **జయజానకినాయక**, శ్రీనివాస : **ఫిదా**
శ్రీవేంకటేశ్వరా : **నేనే రాజు నేనే మంత్రి**
శ్రీరంగ : **లైఫ్**, బృందావన్ : **గౌతమ్‌నంద**



ఘనంగా బోనాల పండగ

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ గుడికి మహిళలు బోనం కుండలను తీసుకెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో మహిళలంతా ఉత్సాహంగా తరలి వెళ్లారు. ఊరంతా పండగ వాతావరణం కనిపించింది. చిన్నాపెద్దా సంబరాలు చేసుకున్నారు.

దీపం పథకానికి అర్హులను గుర్తించండి

పెబ్బేరు, న్యూస్‌టుడే : మండలంలో దీపం పథకం కింద సిలిండర్ల పంపిణీకి అర్హులైన వారిని గుర్తించి జాబితా తయారు చేసి సమర్పిస్తే అందిస్తామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటికీ ఇంకా 2575 మందికి సిలిండర్లు లేవని తేలిందని, దీనిపై డీలర్ల మరోసారి సర్వే చేసి అర్హుల జాబితాను



అధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న డీఎస్‌వో తనూజ

తయారు చేసి సమర్పిస్తే దీపం పథకం కింద సిలిండర్లు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. అలాగే రేషన్ డీలర్లు ఆధార్ సంఖ్యతోపాటు కుటుంబంలోని మరో ఇద్దరి నంబర్లు ఇవ్వాలని కోరారు. అక్టోబర్ నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ అమలు చేస్తామని, ఆలోపు వీటికి సంబంధించినవి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డుదారుల చరవాణి సంఖ్యలు ఇంకా మిగిలి ఉంటే, వెంటనే సేకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సరకులు పంపిణీ చేయాలని డీఎస్‌వో తనూజ కోరారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దారులు మారేదెన్నడో?



అధ్వానంగా కంబాళాపురంతండా రహదారి



తాటిపాములతండా రోడ్డు ఇలా..

పల్లె రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాలకు చెందిన అనేక గ్రామాల, తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా, కొత్త జిల్లాలు ఏర్పడినా రహదారుల తీరు మాత్రం అలాగే ఉందని వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, పెబ్బేరు

చిత్ర కదంబం



శేరుపల్లి- కంబాళాపురం రహదారి



పెబ్బేరు -శేరుపల్లి రోడ్డు

ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో(ఐటీఐ) మిగిలిపోయిన సీట్లకు (రెండో విడతగా) ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యుడు శంకరయ్య తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు సమర్పించే వీలుందని ఆయన తెలిపారు. దరఖాస్తుల చేసే విద్యార్థులు ఐటిఐ.తెలంగాణ.గోవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలను సంప్రదించాలన్నారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎమ్మెల్యే చిన్నారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

ఆంధ్రాబ్యాంకును స్వయంగా ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో దాదాపు 25 నిమిషాలపాటు బ్యాంకులోనే బెంచీపై కూర్చొని ఎదురుచూశారు. సబ్ మెనేజరు ఫణీంద్రుడు అక్కడికి చేరుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. నాయకులు రమేశ్, మురళీధర్‌సాగర్, దేవన్న, రామకృష్ణారెడ్డి, నరేందర్ ఉన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలను నిర్వహించారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆదేశానుసారం విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో 350 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. వారిలో అండర్-14,



పోటీలకు సిద్ధం చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో నాలుగు జతల చొప్పున జట్లను ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు మన్నెం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు దేవేందర్, షైనీ, చందర్ పాల్గొన్నారు.

వచ్చేనెల 1న సామూహిక సెలవు



డీఎంహెచ్‌వోకు సామూహికసెలవు పత్రం ఇస్తున్న ఉద్యోగులు

వనపర్తి, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకం కింది ఉద్యోగులు సెప్టెంబరు ఒకటో తేదీన సామూహిక సెలవుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఉద్యోగులు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్నే అమలు చేయాలని కొన్నాళ్లుగా సీపీఎస్ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం చలించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి శ్రీనివాసులుకు సామూహిక సెలవు మంజూరు కోరుతూ పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ప్రజారోగ్య ఉద్యోగుల సంఘాల నాయకులు దాసరి రవీందర్, సుస్రుత్‌అలి, నర్సింగరావు, వెంకటయ్య, మధుకర్, ఖలీల్, విజ్ఞత, హబీబ్‌సలామ్, వెంకటేశ్, కేశవ్, చంద్రయ్య, ఫకీరప్ప, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

వందశాతం మరుగుదొడ్లు పూర్తి చేయాలి

తాడిపర్తి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, అక్టోబరు 2వ తేదీ నాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో



చెక్కులు అందిస్తున్న సర్పంచి, ఎంపీడీవో తదితరులు

100శాతం పూర్తి చేయ్యాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని తాడిపర్తిలో సర్పంచి గణేశ్‌గౌడు అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్న వారికి చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి శంకరయ్య, ఎంపీటీసీసభ్యుడు కృష్ణయ్యయాదవ్, పంచాయతీ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఏపీవో సత్యనారాయణ, వార్డుసభ్యులు పాల్గొన్నారు. గోపాల్‌పేటలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి సర్పంచి పద్మబాలరాజు, ఎంపీడీవో బాలాజీ, ఉపసర్పంచి మైబూస్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అకౌంటెంట్, కంప్యూటర్, ఆపరేటర్స్, అటెండర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు స్త్రీనిధి, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఒంటరి మహిళలకు పింఛను, తెలంగాణ హరితహారం, బీమా, వ్యక్తిగత మరగుదొడ్ల వంటి కార్యక్రమాలను మహిళా సంఘాలకు చేరవేస్తున్నామన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా



నిరసన తెలుపుతున్న సెర్ప్ సిబ్బంది

మండలాల సెర్ప్ సిబ్బంది మునీందర్, రాధ, రాజు, సురేశ్, నరసింహ, విజయ్, బాలీశ్వరమ్మ, గిరమ్మ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిది తప్పుడు ప్రచారం : ఎమ్మెల్యే చిన్నారెడ్డి

వనపర్తి గ్రామీణం : తెలంగాణ ఏర్పడిన తొలి నాళ్లలోనే పోలీస్ అకాడమీకి రాజాబహుద్దూర్ వెంకటరామారెడ్డి పేరు పెట్టామని సీఎం కేసీఆర్ తప్పుడు ప్రచారం చేయడం ఆయన స్థాయికి తగదని ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. రాజాబహుద్దూర్ వెంకటరామారెడ్డి హైదరాబాదుకు కొత్వాల్‌గా పనిచేశారన్నారు. ఆయన చేసిన అభివృద్ధికి 2013, మార్చి 14న అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జీవో నంబరు 83 ప్రకారం పోలీస్ అకాడమీకి రాజాబహుద్దూర్ వెంకటరామారెడ్డి పేరు పెట్టారన్నారు. గత పాలకులు పట్టించుకోవడం లేదని సీఎం ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు.

కేసీఆర్ కిట్టు అందజేత

గోపాల్‌పేట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయిన మహిళకు బుధవారం డీఎంహెచ్‌వో డా.శ్రీనివాసులు కేసీఆర్ కిట్టును అందించారు. కేసీఆర్ కిట్ల పంపిణీ ప్రారంభమైనతర్వాత జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగిందన్నారు. ఆసుపత్రి వైద్యాధికారిణి డా. మంజుల, సీహెచ్‌వో విష్ణువర్ధన్‌గౌడు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

104 వైద్య సమాచారం

రేవల్లి, న్యూస్‌టుడే : మండలంలోని నాగపూరులో గురువారం 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తామని సిబ్బంది తెలిపారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు.

వనపర్తి టౌన్

పోలీస్ స్టేషన్ : 232333 (100)
ప్రభుత్వ ఆసుపత్రి: 232113
ఫైర్ స్టేషన్: 101 **అంబులెన్స్:** 108
అవినీతి నిరోధక శాఖ: 9440446143
విద్యుత్ ఎంక్వైరీ: 232104
నీటి పంపిణీ: 232044
గ్యాస్ ఏజెన్సీ: 232235
తహశీల్దార్ కార్యాలయం: 232046
ఎండీఓ కార్యాలయం: 232043
అవినీతి నిరోధక శాఖ: 9440446143
మహిళల వేధింపుల ఫిర్యాదు: 1091

వనపర్తి

నేటి నుంచి సూగూరులో ఉర్సు ఉత్సవాలు

సూగూరు(పెబ్బేరు) : మండలంలోని సూగూరులో హజ్రత్ సయ్యద్ ఫకీరుల్లా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడ్రోజులపాటు ఘనంగా సాగుతాయని ఉర్సు నిర్వహకులు తెలిపారు. గురువారం గంధోత్సవం, ఊరేగింపు, శుక్రవారం భక్తులకు దర్శనం, సాయంత్రం ఖవ్వాలి కార్యక్రమం, శనివారం ఖత్మే ఖురాన్ పాతహే తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ మక్బూల్‌పాషా ఖాద్రి తెలిపారు.

నీళ్లు, నిర్వాసితుల కోసం మహాధర్నా



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగు ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీటినందించాలని, ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయే వారికి మేలైన నష్ట పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లాలో నీళ్లు, నిర్వాసితుల కోసం ఈనెల 28న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికోసం 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయే బాధిత రైతులకు రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగే నష్టంలో భాగంగా గుడికి గుడి, బడికి బడి విధానాన్ని అమలు చేయాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ నుంచి డిండికి నీరు తరలించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. కోయిల్‌సాగర్, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు తదితర ప్రాజెక్టుల చివరన ఉన్న ఆయకట్టు రైతులకు సాగునీరందించే చర్యలను చేపట్టాలన్నారు. పార్టీ మండల కార్యదర్శులు, నాయకులు ఎం.ఆంజనేయులు, బాల్‌రెడ్డి, నిక్సన్, మండ్ల రాజు, గోపి, గోపాకృష్ణ, వినయ్ పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు దసరా సెలవుల్లో చేపట్టాలి

గోపాల్‌పేట : రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను చేపట్టాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆయన గోపాల్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న హెచ్ఎం, ఎంఈవో, డైట్ అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెండింగులో ఉన్న పండిట్, పీఈటీల పదోన్నతులనూ దసరా సెలవుల్లోనే చేపట్టాలని ఆయన అన్నారు. అక్టోబరు 1న చేపట్టే సామూహిక సెలవులకు టీటీయూ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ సీపీఎస్ విధానాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. టీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, నాయకులు బాలస్వామి, రాజారెడ్డి, శ్యాంసుందర్, శ్రీశైలం, జావీద్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వ్యక్తికి జరిమానా

వనపర్తి గ్రామీణం : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి రూ.2వేల జరిమానా విధించారు. పట్టణ ఠాణా సహాయ ఎస్సై అహ్మద్‌హుసేన్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపినందుకు వనపర్తి జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఇందిర తీర్పు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జరిమానా కట్టని పక్షంలో నాలుగు రోజుల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

బస్టాండుకు బెంచీల వితరణ

పెబ్బేరు : మండలంలోని తోమాలపల్లి ప్రయాణ ప్రాంగణంలో బెంచీలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో కొత్తకోట మండలం పామాపురానికి చెందిన బీఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు వారు బెంచీలు ఏర్పాటు చేశారు. దీంతో సమస్యలు తొలగిపోయాయని గ్రామస్థులు, ప్రయాణికులు తెలిపారు. దాతలకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

గోపాల్‌పేట : ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడమే సురక్షితమని నాగర్‌కర్నూలు డీఎం రాజీవ్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన గోపాల్‌పేట బస్టాండును ఆకస్మికంగా పరిశీలించారు. బస్టాండు ముందు భాగాన వస్తువులను అమ్మకానికి పెట్టగా.. వాటిని డీఎం తొలగింపజేశారు. మండల కేంద్రంలో వారాంతపు సంత కావడంతో బస్టాండు ప్రాంతం ప్రజలు, అమ్మకందారులతో కిక్కిరిసింది. వనపర్తికి బిజినపల్లి, రేవల్లి మీదుగా నాగర్‌కర్నూలు నుంచి తిరిగే షటిల్ బస్సులు వెంటవెంటనే వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణీకుల నుంచి ఫిర్యాదులు రావడంతో డీఎం స్వయంగా బస్టాండులో కూర్చొని వచ్చిపోయే బస్సులను పరిశీలించారు. బస్సులను కొద్దిసేపు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునేలా చూశారు. డీఎం వెంట సిబ్బంది వెంకటేశ్, నర్సింహ, బాల్‌రాజు ఉన్నారు.



తాళ్లను తొలగించాలని చెబుతున్న డీఎం

వ్యక్తిగత మరుగుదొడ్ల పెండింగు బిల్లుల చెల్లింపు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తి పురపాలక సంఘంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణ పథకం కింద నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల పెండింగు బిల్లులను చెల్లించినట్లు పురపాలక సంఘం కమిషనరు వీరబుచ్చయ్య తెలిపారు. ఇటీవల నిర్మించుకున్న 252 మందికి రూ.15.12 లక్షల బిల్లులను చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఈ బిల్లులను బుధవారం లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి లబ్ధిదారులకు రూ.కోటి వరకు బిల్లులు చెల్లించినట్లు ఆయన తెలిపారు.

పండగలు మతసామరస్యానికి ప్రతీకలు

వనపర్తి, న్యూస్‌టుడే : పండగలు మతసామరస్యానికి ప్రతీకలను, సర్వమత సౌభ్రాతృత్వంతో జరుపుకోవాలని ఎమ్మెల్యే చిన్నారెడ్డి అన్నారు. బుధవారం రాజస్వ మండలాధికారి కార్యాలయంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి పండగను శాంతియుతంగా జరుపుకుందామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని, వాటిద్వారా వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. అధికారులు నిర్దేశించిన ప్రకారం గణేశ మండళ్లు అన్ని రకాల అనుమతులు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, ప్రమాదాలకు తావులేకుండా మండపాల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసుల సాయమూ పొందాలన్నారు. సమావేశంలో ఆర్డీవో చంద్రారెడ్డి, ఎంపీపీ శంకర్‌నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, కౌన్సిలర్లు ఉంగ్లం తిరుమల్, విజయలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, పలు రాజకీయ పార్టీల నాయకులు, మతపెద్దలు హాజరయ్యారు.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు అవగాహన

పెద్దమందడి, న్యూస్‌టుడే : గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు బుధవారం ఠాణాలో వైద్యుల విధివిధానాలపై ఎస్సై లెనిన్ అవగాహన కల్పించారు. ఎలాంటి ధ్రువపత్రాల్లేకుండా వైద్యం చేస్తే చట్టరీత్యా నేరమని ఎస్సై వారికి సూచించారు. వైద్యం పేర అధిక వసూళ్లు చేయారాదని సూచించారు.

అయ్యప్ప ఆలయంలో హరితహారం

నాగవరం(వనపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని నాగవరం శివారు అయ్యప్ప ఆలయంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నక్షత్రాల పేరుతో 27 నక్షత్రాల మొక్కలను నాటారు. అంతకుముందు మొక్కలకు సంఘం నాయకులు పూజలు చేశారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ డైరెక్టర్ జ్యోషి గోపాలశర్మ మాట్లాడుతూ.. నక్షత్రాల పేరుతో ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటిసారిగా చేపట్టామన్నారు. రాష్ట్రంలో నక్షత్రాల పేరుతో మొక్కలను నాటడం రెండోసారన్నారు. నాటిన మొక్కలకు ప్రతి ఒక్కరూ నీరు పోసి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మనోహరశర్మ, రమేష్‌శర్మ, మురళీధర్‌రావు, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌శర్మ, నవన్‌శర్మ, గోపీకృష్ణశర్మ, శ్రీకాంతాచార్యులు, విరివింటి అశోక్, రమేష్ ఆచారి, విఠల్‌రావు, నితీశ్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ, నాగరాజుశర్మ, కొత్తకోట బుచ్చయ్యశర్మ, అయ్యప్ప సేవాసమితి సభ్యులు ముత్తుకృష్ణ, వీరయ్యగుప్తా, నరేందర్, ఆలయ ట్రస్టు మేనేజర్ సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే ఉచిత విద్యను అమలు చేయాలి

వనపర్తి పట్టణం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీని తక్షణమే అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ, స్కాలర్స్ డిగ్రీ కళాశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచిత విద్యను అమలు చేయని కారణంగా కళాశాలల్లో రూ.7500 చొప్పున ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారన్నారు. తద్వారా పేద విద్యార్థులు చదువుకోవడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. డిగ్రీలో సగభాగం సబ్జెక్టులు ఉత్తీర్ణులు కావాలన్న డిటెన్షన్ విధానంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 5వేల మంది విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తీరని అన్యాయాన్ని తలపెట్టే డిటెన్షన్ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హుసేన్, నాయకులు అనోక్, పరశురాం పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



పెబ్బేరు : శిబిరంలో పాల్గొన్న బాలల సంఘాల నాయకులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండల కేంద్రం రేవల్లిలో బుధవారం బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా.చిరంజీవి బాలబాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బాలలను పెద్ద శిక్షలకు గురిచేయడం చట్టవిరుద్ధమని ఎస్‌వీకే మండల సమన్వయకర్త తిరుపతయ్య అన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల బాలల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమందడి : బాలల హక్కులకు భంగం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని శ్రామిక వికాస సంఘాల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవి బాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయంలో బాలల సంఘాల అధ్యక్షులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో సత్యనారాణరెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగరాజు, ఎస్సై లెనిన్ మాట్లాడారు. మండల సమన్వకర్త కృష్ణవేణి, క్లస్టర్ సమన్వయకర్తలు తులసి, నాగేష్, మహేశ్వరి పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం : బాలబాలికల్లో చదువుతోపాటు సామాజిక అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో శ్రామిక వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో బాలబాలికలు, కిషోరబాలికలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడారు. బాలబాలికలు, విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చాలన్నారు. బాలబాలికల హక్కులకు భంగం కలుగకుండా చూడాలన్నారు. ఎస్సై చంద్రమౌళి మాట్లాడుతూ.. బాలబాలికలు చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. సంస్థ మండల సమన్వయకర్త కృష్ణ, ప్రతినిధులు మమత, శంకర్, వెంకటమ్మ, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు : బాలలు చిన్నప్పట్నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని యునిసెఫ్, శ్రామిక వికాస కేంద్రం మండల సమన్వయకర్త రవికుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జూరాల అతిథిగృహంలో బాలల నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాలల సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షలు, ఇతర సభ్యులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చారు. శ్రామిక వికాస కేంద్రం మండల బాధ్యుడు రవికుమార్, వీరశేఖర్, శ్రీవాణి, సరళమ్మ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం : గ్రామాల్లో ఏర్పాటైన బాలల కమిటీ సభ్యులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మార్కెట్ డైరెక్టర్ పర్వతాలు కోరారు. బుధవారం శ్రీరంగాపురం ఠాణాలో వివిధ గ్రామాలకు చెందిన యునిసెఫ్, శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటైన బాలల కమిటీ సభ్యులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు భాస్కర్, వెంకటరమణ, రాములు, శ్రామిక వికాస కేంద్రం సభ్యులు శ్రీలత, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సంకట హరుడా.. స్వాగతం



ఏనుగొండ : గొడుగునీడలో ప్రతిమలను అమ్ముతున్న మహిళ



కొనుగోలుదారుల కోరిక మేరకు తుదిమెరుగులు దిద్దుతున్న విక్రయదారు

వినాయక చవితికి ఇంకా ఒక రోజు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రతిమలను మండపాలకు తరలించే పనిలో యువత నిమగ్నమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ, అప్పన్నపల్లి ప్రాంతాల్లో తయారు చేసిన విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. జిల్లా కేంద్రానికి చుట్టు పక్కల ప్రాంతాలలో ప్రతిష్ఠించే గణనాథులను ముందస్తుగానే మండపాలకు తరలిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని గణనాథుల విక్రయకేంద్రాల వద్ద సందడి నెలకొంది. భక్తుల అభిరుచికి తగ్గట్టుగా వివిధ రూపాలు అందుబాటులో ఉండటంతో ఇక్కడే కొనుగోలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. భారీ విగ్రహాలను ప్రతిష్ఠించే భక్తులు హైదరాబాద్, బెంగళూరు నుంచి తీసుకు వస్తున్నారు. విగ్రహాల తరలింపు పాలమూరుకు ఇప్పుడే పండగశోభను తెచ్చి పెట్టింది. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

చిత్ర కదంబం

- ఈనాడు, మహబూబ్‌నగర్



విక్రయకేంద్రాలలో ఆకట్టుకుంటున్న ప్రతిమలు



ట్రాక్టర్‌లో మండపానికి తరలిస్తున్న హన్వాడకు చెందిన యువకులు

హద్దు దాటిన వ్యసనం

- మందుబాబులతో కిక్కిరిసిన దుకాణాలు
- ఎమ్మార్పీ ఉల్లంఘించినా చర్యలు శూన్యం
- చౌరస్తాలో ప్రయాణికులకు అవస్థ



మద్యం దుకాణం వద్ద మందుబాబుల సందడి

న్యూస్‌టుడే, అలంపూర్ చౌరస్తా (ఉండవల్లి)

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా కర్నూలులో మద్యం విక్రయాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ చౌరస్తాలో మద్యం దుకాణాలు అందుబాటులో ఉండటంతో మద్యంప్రియులు ఇక్కడికి బారులు కట్టారు. ఇదే అదునుగా భావించిన మద్యం దుకాణాల నిర్వాహకులు ఎమ్మార్పీ ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరిపారని మద్యం ప్రియులు ఆరోపించారు. ఎమ్మార్పీ ధరలను ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన మద్యనిషేధ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ తతంగం గత రెండు రోజుల నుంచి పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు కూడా అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని, నెలనెలా మామూళ్లు ముట్టడం వల్లే చర్యలు తీసుకోలేకపోతున్నారనే ఆరోపణలు మద్యంప్రియుల నుంచి బాహాటంగా వెల్లువెత్తుతున్నాయి. బుధవారం మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడగా.. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మద్యం తాగిన మందుబాబులు ఒక్కసారిగా రోడ్డుపైకి వస్తుండటంతో మహిళా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు కూడా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మద్యం దుకాణాల ముందు ఇలా..

స్వైన్‌ఫ్లూ కేసు నమోదు

బాదేపల్లి న్యూస్‌టుడే : జడ్చర్ల మండలంలో స్వైన్‌ఫ్లూ కేసు నమోదైంది. 25 ఏళ్ల యువకుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కానీ ఫలితం కనిపించకపోవడంతో హైదరాబాద్ గాంధీ తీసుకెళ్లాలని డాక్టర్ సూచించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు స్వైన్‌ఫ్లూ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఆ యువకుడికి మెరుగైన చికిత్సలు అందుతున్నాయని స్థానిక వైద్యుడు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ముందస్తు స్వైన్‌ఫ్లూ నివారణ మందులను పంపిణీ చేశామని చెప్పారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అధ్యయనం

మద్దలబండ(మల్దకల్) న్యూస్‌టుడే : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అధ్యయనం చేయడానికి మండల పరిధిలోని మద్దలబండకు వచ్చామని జపాన్ ఏసీఈ సంస్థ సమన్వయకర్త యేసాక ఓకామొట్టొ అన్నారు. బుధవారం బృందం సభ్యులు గ్రామంలో స్పీడ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలకార్మిక పాఠశాలను సందర్శించారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వారు ఆంగ్లంలో ప్రసంగించగా జీవన్ తెలుగులోకి అనువదించి గ్రామస్థులకు వివరించారు. గ్రామంలో 30 మంది బాలకార్మికులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని.. బడిలో ఉండాల్సిన పిల్లలు పొలంబాట పట్టారని.. వీరి తల్లిదండ్రులు మనసు మార్చుకుని బడికి పంపాలని సూచించారు. అంతకుముందు ఈ బృందం పత్తి పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో తిరిగి బాలకార్మికుల తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవిప్రకాశ్, సర్పంచి తిమ్మప్ప, ఎంపీటీసీ సభ్యుడు నర్సింహులు, సంస్థ మేనేజర్ మధులత, జీవన్, మనోహర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బాలకార్మికుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జపాన్ బృందం

రైల్వే కోచ్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు

ఉండవల్లి : మండల పరిధిలోని బైరాపురం గ్రామం సమీపంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని తహశీల్దార్ మదన్‌మోహన్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలో నుంచి బైరాపురం వరకు ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరగనుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం కావాల్సిన భూమిని స్థానిక రైతులతో పాటు వక్ఫ్‌బోర్డు, దేవదాయ శాఖ భూమిని సేకరించామన్నారు. రైతుల నుంచి దాదాపు 26 ఎకరాలు సేకరించగా.. వక్ఫ్‌బోర్డు, దేవదాయ శాఖలకు చెందిన మరో ఆరు ఎకరాల భూమిని సేకరించినట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ ఆదేశాల మేరకు ఒక్కో ఎకరాకు రూ.12 లక్షల వరకు పరిహారం చెల్లించనున్నట్లు ఆయన వివరించారు. సేకరించిన భూములకు సంబంధించిన పూర్తి పత్రాలు తీసుకున్న తర్వాత.. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ధృవపత్రాలను మరోసారి క్షుణ్నంగా పరిశీలిస్తామని అనంతరం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

రెండో పెళ్లి వద్దన్నందుకు.. ఉరేసుకొని యువజంట ఆత్మహత్య

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : ఆ యువతీయువకులిద్దరు కొన్నేళ్ల పాటు ప్రేమించుకొన్నారు. అందులో యువకుడికి అప్పటికే వివాహమైంది. అయినా.. ప్రేమించిన యువతిని వదులుకోకుండా ఆమెనూ పెళ్లి చేసుకోవాలని భావించాడు. దీనికి యువకుడి భార్య, కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపారు. ప్రేమించిన యువతిలేని జీవితాన్ని ఊహించడాన్ని కష్టంగా భావించిన ఆ యువకుడు.. తన ప్రేయసితో కలిసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చివరికి ఆ యువజంట నాగరాజు(28, శృతి(20) జీవితం విషాదంతంగా ముగిసింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఇప్పపల్లి గ్రామ శివారులో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామానికి చెందిన నాగరాజుకు నాలుగేళ్ల క్రితం అదే గ్రామంలోని ఉమాదేవితో వివాహమైంది. వీరికి హృతిక్ అనే కుమారుడున్నాడు. ఇదిలా ఉండగా.. వివాహమైన కొన్ని రోజులకు నాగరాజు హైదరాబాద్‌కు వెళ్లి లింగంపల్లిలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ ఇంటికి ప్రతినెలా డబ్బును పంపిస్తుండే వాడు. ఈ క్రమంలో తూడుకుర్తి గ్రామానికి చెందిన, సమీప బంధువైన శృతి హైదరాబాద్‌లోని బీరంగూడలో ఉంటూ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుండేది. అక్కడే నాగరాజు, శృతికి మధ్య పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. అప్పటికే వివాహమైన నాగరాజు.. శృతిని పెళ్లి చేసుకుంటానని భార్య, కుటుంబసభ్యులకు చెప్పాడు. ఈ నిర్ణయానికి భార్య ఉమాదేవి, కుటుంబసభ్యులు అడ్డుచెప్పారు. దీంతో ఈనెల 21వ తేదీ నుంచి నాగరాజు, శృతి కనిపించకుండా పోయారు. వీరికోసం ఇరువురి కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి తిమ్మాజిపేట సమీపంలోని ఓ చెట్టుకు ఇద్దరూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాలను కిందకు దింపి పూర్తి వివరాల సేకరించారు. అక్కడే నాగరాజు రాసిన లేఖ లభ్యమైంది. "అమ్మా, నాన్న.. నన్ను క్షమించమని అడిగే అర్హత నాకు లేదు, మీ కడుపుమాడ్చుకొని మరీ నన్ను చదివించారు. నాకు అప్పుడు మీ విలువ తెలియలేదు. నాకు కొడుకు పుట్టిన తరవాతే మీ విలువేంటో తెలిసింది. ఉమా నువ్వు అంటే నాకు ప్రాణం. నేను నిన్ను ప్రేమిస్తున్నా.. నన్ను క్షమించు, బాబును బాగాచూసుకో' అంటూ నాగరాజు లేఖలో రాశాడు. లేఖలో ఉన్న తల్లిదండ్రుల చరవాణి సంఖ్య ఆధారంగా పోలీసులు నాగరాజు, శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. యువజంట ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకొని మృతదేహాలను శవపంచనామా కోసం జడ్చర్ల ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి యువజంట వచ్చిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



చెట్టుకు వేలాడుతున్న యువజంట మృతదేహాలు



శృతి, నాగరాజు మృతదేహాలు

సీపీఎస్ రద్దే మా పంతం

- సెప్టెంబరు 1న సామూహిక సెలవుకు సంపూర్ణ మద్దతు
- టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, న్యూస్‌టుడే : సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పింఛను పథకం) రద్దే తమ పంతమని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్)జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ క్లబ్‌లో టీజీవోస్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో కేంద్ర ప్రభుత్వం, 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ విధానాన్ని ఆర్డినెన్స్ ద్వారా బలవంతంగా ఉద్యోగులపై రుద్దారని పేర్కొన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ.. సెప్టెంబరు 1న ఉద్యోగులు చేపట్టిన సామూహిక సెలవుకు టీజీవోస్ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు జిల్లాలోనూ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో జిల్లాల విభజన సందర్భంగా గతేడాది దసరా రోజున ఆర్డర్ టూ సర్వ్ పేరుతో ఉద్యోగులను ఇతర జిల్లాల్లో విధులు కేటాయించారని, అప్పటి నుంచి ఉద్యోగులు కుటుంబాలను వదిలి ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఈ విధానంలో సడలింపు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణలో ఉద్యోగులు అందుకునే మొట్టమొదటి పీఆర్సీ 2018 జులై అని ఆ పీఆర్సీ సకాలంలో అందేందుకు టీజీవోస్ కృషి చేస్తుందన్నారు. జిల్లాలో టీజీవో అసోసియేషన్ భవన నిర్మాణం చేపడతామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బక్క శ్రీనివాసులు మాట్లాడుతూ. . రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం బంగారు తెలంగాణ సాధనకు ఉద్యోగులు, అధికారులు పూర్తిస్థాయిలో పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా పనిచేస్తున్నారన్నారు. చిన్న తప్పులు, పొరపాట్ల కారణంగా సస్పెండ్ అయిన అధికారులు, ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణాగౌడ్ మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ ఉద్యోగులను ఎవరి ప్రాంతానికి వారిని కేటాయించడంతో పాటు ఆర్డర్ టూ సర్వ్‌ను సడలించాలన్నారు. సమావేశంలో టీజీవోస్ గౌరవ అధ్యక్షుడు ఎండీ. రవూఫ్, ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు ఫర్కుందా తస్నీమ్, ఆర్జే సురేష్, మల్లికార్జున్, నాయకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బంది మూకుమ్మడి సెలవు

మహబూబ్‌నగర్ పట్టణం : సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి రాష్ట్రవ్యాప్తంగా పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చేపడుతున్న నిరసనలో భాగంగా బుధవారం జిల్లాపరిషత్తు, పంచాయతీరాజ్ సిబ్బంది ఈఈ అశోక్‌కు సెప్టెంబరు 1న సామూహిక సెలవు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం సీపీఎస్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఉద్యోగులు రవీందర్‌గౌడ్, సత్యకృష్ణ, శారద, దివ్య పాల్గొన్నారు.

27న అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ (క్రీడలు), న్యూస్‌టుడే : అంతర్ జూనియర్ కళాశాలల స్థాయి ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికను ఈ నెల 27న గద్వాల మినీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సంఘం కార్యదర్శి పాపిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రికెటర్లు బోనఫైడ్, వయస్సు ధ్రువీకరణతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్రస్థాయి స్థాయి టోర్నీ సెప్టెంబరులో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

హిందీపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : హిందీ భాషపై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల హిందీ విభాగం సహాయ ఆచార్యులు డా.నరసింహారావు కల్యాణి అన్నారు. బుధవారం ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో 'హిందీ భాష - ఉపాధి అవకాశాలు' అనే అంశంపై విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాష ద్వారా కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో అనువాదకులుగా, హిందీ అధికారిగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని అన్నారు. పత్రిక రంగంలో వివిధ టి.వి.చానళ్లలో హిందిలో నిష్ణాతులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సహాయ ఆచార్యులు అపర్ణ చతుర్వేది మాట్లాడుతూ... హిందీ భాష జాతీయ సమైక్యతకు దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జిల్లా అధ్యక్షుడు మహేశ్

పాలమూరు, న్యూస్‌టుడే : ఇందిరా క్రాంతి పథంలో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఐకేపీ సీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ కూడలిలో ఐకేపీ వీవోఏలు 8వ రోజు చేపట్టిన సమ్మెలో బతుకమ్మలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేకేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను గ్రామ ప్రాంతాలలో అర్హులైన వారికి అందించేలా కృషి చేస్తున్నామని, ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి పేదలకు సేవలు అందిస్తున్నామని అన్నారు. మండల మహిళా సమాఖ్యలో పని చేస్తున్న వీవోఏలు, కంప్యూటర్ సహాయకులు తదితర సిబ్బందికి ఎలాంటి వేతనాలు పెంచలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తెలంగాణ కూడలిలో మానవహారం నిర్వహించారు. బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫరూఖ్, కోశాధికారి కవిత, నాయకులు శంకర్, అలివేలమ్మ, రాము, రాజు, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, కృష్ణయ్య పాల్గొన్నారు.



తెలంగాణ కూడలిలో ధర్నా చేస్తున్న ఉమ్మడి జిల్లాల వీవోఏలు

26న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల సదస్సు

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు ఈ నెల 26వ తేదీన ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు భౌతికశాస్త్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌కృష్ణ, ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంతి, విద్యుదయస్కాంతత్వం, విద్యుత్తు అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. సదస్సులో పాల్గొనే ఉపాధ్యాయులు 9441207571, 7386770945 నంబర్లకు సంక్షిప్త సందేశాలు పంపించాలని సూచించారు.

ఆర్టీసీ మెకానిక్‌లకు అత్యధిక మైలేజీ అవార్డులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో పనిచేసి బదిలీపై వెళ్లిన మెకానికల్ ఫోర్‌మెన్‌తో పాటు మరో నలుగురు మెకానిక్కులు, ఒక హెల్పర్‌కు అత్యధిక మైలేజీ అవార్డులు దక్కాయి. మోటారు వాహన కంపెనీ అశోక్ లీలాండ్ ఈ అవార్డులను ప్రదానం చేసింది. రాజధానిలోని ఆర్టీసీ కళాభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు ఈ అవార్డులను అందజేశారు. గత ఏడాది మహబూబ్‌నగర్ డిపోలో ఎంఎఫ్‌గా పని చేసిన నర్సప్ప, హెల్పర్‌గా పనిచేస్తున్న ఎం.కృష్ణయ్య, మెకానిక్‌లుగా పనిచేస్తున్న వెంకటయ్య యాదవ్, ఆంజనేయులు, రాఘవేందర్, హైమద్ అలీలు ఈ వార్డులు అందుకున్నవారిలో ఉన్నారు. బస్సు ఇంజిన్ 10 లక్షల కిలోమీటర్ల వరకు మంచి సామర్థ్యంతో పనిచేసేలా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం ద్వారా వృత్తిలో సాంకేతిక పద్ధతులు అనుసరించినందుకు ఈ ఆరుగురు ఉద్యోగ, కార్మికులకు అవార్డులు దక్కినట్లు జిల్లా అధికారులు తెలిపారు. 2011 మొదలు 2017 మే మాసం వరకు ఈ ఆరేళ్ల కాలం బస్సు ఇంజిన్ల పని తీరును పరిగణలోకి తీసుకొని ఈ వార్డులు ఇచ్చామన్నారు.



ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు నుంచి అవార్డులు అందుకుంటున్న మెకానిక్‌లు

రాష్ట్రాభివృద్ధి కోసమే టీ-మాస్

జిల్లా అధ్యక్షుడు జలజం సత్యనారాయణ

పాలమూరు, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం టీ-మాస్ పని చేస్తుందని తెలంగాణ ప్రజా సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీ-మాస్) కమిటీ జిల్లా అధ్యక్షుడు జలజం సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు మారుతాయని భావించిన ప్రజలకు తీవ్ర నిరాశే ఎదురయిందని అన్నారు. సమాజంలో 97 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఎంబీసీ కులాలకు చెందిన వారే ఉన్నారని, వారికి అన్ని రంగాల్లో నిరాశే ఎదురవుతోందన్నారు. రాజ్యాధికారం ఏడు శాతం ఉన్న ఉన్నత వర్గాల చేతుల్లో ఉందన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయాన్ని అందించడానికే టీ-మాస్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సామాజిక న్యాయ సాధన కోసం ఏర్పడ్డ టీ-మాస్ మహావృక్షంలా పెరుగుతుందన్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకు అన్ని మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలజం సత్యనారాయణ కన్వీనర్‌గా బూరుగుపల్లి చంద్రకాంత్, కమిటీ సభ్యులుగా రాయకంటి రాందాస్, విజయ్‌కుమార్, సింగిరెడ్డి పరమేశ్వర్, మంత్రి నర్సింహయ్య, వెంకట్రాములు, కుర్మయ్య, ఖమర్ అలీ, వీరాంజనేయులు, కురుమూర్తి, రాములు, వినోద్‌కుమార్, హజమ్మ, వెంకట్రామ్‌రెడ్డి, గులాంగౌస్, గోపాల్‌తో పాటు మరో 65మంది సభ్యులతో కమిటీ ఏర్పడింది.



సమావేశంలో మాట్లాడుతున్న జలజం సత్యనారాయణ